పావంచాలు

తెన్నేటి సూరిగారు బి. ఎ.

*
* *

[రవీంద్రుని కథ]

[స్వర్ణయుగ పరిషత్]

మునుపటి ముచ్చట్లేమైనా వినాలనివుంటే, నాయీ మెట్టుమీదకూర్చో, ఈనదీజల మర్మరానికి చెవియొగ్గి-

ఆశ్వయుజమాసం ప్రారంభమైంది. నదీగర్భం తటపటాయించి వుంది. నాలోనాలుగు మెట్లు మాత్రం మిగిలాయి నీటిపైన. పల్లాలుగావున్నచోట గట్లదాకా ఎగబ్రాకింది నీరు. మామిడి గుబురుల నీడను నాచు దట్టంగా అల్లుకునివుంగి. ఆయేటివంపులో మూడు ఇటుకరాతికప్పులు, నీటిపైన కనుపించుతూవున్నాయి, గోపురాలులా. చిన్నచిన్న పడవలు—చేపలుపట్టేవి—గట్టుమీదవున్న మర్రిచెట్టుకు కట్టివేసివున్నాయి. ఆ చిటికెరటాలమీద అవి అటూయిటూ వూగుతూవున్నాయి వుయ్యాలలులా. ఆగట్టుమీదవున్న త్రోవకు ఇరువైపులా పచ్చగడ్డి ఎత్తుగాపెరిగివుంది. పూత పడుతూపడుతూవుంది. ఇంకా విరియపూయలేదు.

అది నవోదయవేళ. ఆసూర్యకాంతులా గడ్డిపూలమీద పడుతూవున్నాయి. ఆబుల్లిపడవలొకటొకటే తెరచాపల్లోకి గాలిపోసుకుని రవికిరణప్రసారితమైన ఆగంభీరనదీ గర్భంమీద సాగిపోతున్నాయి, యీనాని కుపక్రమించి ఒక కర్మిష్ఠి తనసుశ్రూషపాత్రవర్గంతో సహా స్నానానికి విచ్చేశారు. ఈవూరి పడుచులు, బిందెలు చంకల్నబెట్టుకుని, ఇద్దరిద్దరూ, ముగ్గురు ముగ్గురూ, జట్లుజట్లుగా వస్తున్నారు—నీళ్లకోసం.

కుసుమ వచ్చేవేళయింది.

కాని ఆవేళ ఆబిడ్డరాలేదు. భువన, స్వర్ణ—కుసుమ సంగతి చెప్పుకుని ఊసూరుమన్నారు కుసుమను అత్తవారింటికి తీసుకుని వెళ్లారట. ఆవూళ్లోఅంతా అదో నాలకం మనుష్యులు, అవోరకం ఇళ్లు, అదోతరహా బజారులు, వున్నాయట. ఆవూరు నదికి చాలాచాలా దూరం కూడానట.

ఆపిల్లసంగతే నాకు జ్ఞప్తితప్పింది ఒకసంవత్సరం దాటింది రేవుదగ్గరకూడా ఆడవాళ్లు కుసుమసంగతి చెప్పుకోటమే మానేసేశారు ఇలావుండగా, ఒకనాటి సాయంత్రం, కుసుమతల్లి సన్ననిపొడుగు పాదాలసంయోగం నాకు కలిగింది. నేను విస్ఫురితనయాను. ఆ! ఔను! ఆపాదాలే! కాని, వాటికి మంజీరాలులేవు. అవి పూర్వపు మంజుశింజితాలను పోగొట్టుకున్నాయి.

కుసుమకు వైధవ్యం వచ్చింది. కుసుమభర్త ఎక్కడో చాలాదూరాన పనిచేస్తూవుండేవాడట. ఆబిడ్డతణ్ణి ఎప్పుడో ఒకటిరెండుమార్లు చూసివుండేమో. అతడు చచ్చిపోయాడని ఒకఉత్తరం వచ్చింది ఆమెకు వైధవ్యం — ఎనిమిదవసంవత్సరాన ముఖానవున్న కుంకుమరేఖ చెరుపుకుంది మెళ్లోవున్నసూత్రం తెంపుకుంది. కాళ్లకడియాలూ గట్టాఅన్నీ తీసేసుకుంది. పుట్టింటికి వచ్చేసింది. కాని ఆమె సావాసగత్తెలంతా, ఒక్కళ్లేనా కనుపించకుండా వెళ్లిపోయారు. భువన, స్వర్ణ, అమల అంతా అత్తవారిళ్లకు వెళ్లిపోయారు. సరస్వతిమాత్రం వుంది. ఆఅమ్మాయినికూడా పుష్యమాసంలో కాపురానికి పంపుతారనుకుంటున్నారు.

వర్షారంభం దగ్గరనుంచీ,గంగాకూలంకష చరచరా ప్రపూర్ణతకు పెంపొందినట్లుగానే, కుసుమసహితం సౌందర్య ప్రపూర్ణతకు యవ్వన ప్రపూర్ణతకు పెంపొందింది. కాని వివర్ణమైన ఆమెవస్త్రాలూ, ఆత్మాలోచనలోపడ్డముఖం ఒక ముసుగులాగా ఆమె యవ్వనాన్ని పురుష దృక్పథంనుంచి కప్పిపుచ్చుతూవుంది. నది

సంవత్సరాలు జరిగాయి. తనుయింతగా యవ్వనపూరితయైనవిషయం కుసుమ గ్రహించినట్లుగాలేదు.

ఒకనాటి ఉదయం, ఒకసన్యాసి—పొడుగుపాటి సన్నని సురూపి—ఎక్కడనుంచివచ్చాడో తెలియదు. ఆయెదుటవున్న శివాలయంలో వాసం ఏర్పర్చుకున్నాడు. అతనిరాక ఊళ్లోవున్న ఆబాలగోపాలానికే తెలిసింది. మహిళామండలి యావత్తూ, బిందెలు దూరంగా విసిరేసి గుంపులుగుంపులుగా ఆదేవాలయంలోకి మూగడం మొదలుపెట్టారు స్వామివారికి సాష్టాంగంచేసేందుకు.

జనసమ్మర్దం దినదినం పెంపొందుతోంది. స్వామివారి ఖ్యాతి మహిళాజనంలో నిప్పులా అంటుకుంది. వారు ఒకదినం భాగవతం చదివేవారు. మరోరోజు గీతకు వ్యాఖ్యానంచేసేవారు. ఇంకోరోజు ఇంకో పవిత్రగ్రంథాన్ని సమర్థించి ఉపన్యసించుతూ వుండేవారు. కొంతమంది మంత్రాలకోసం కొంతమంది తంత్రాలకోసం మరోకొందరు మందుమాకులకోసం, ఆయన చుట్టూ మూగుతూండేవారు.

ఇలాకొన్నిమాసాలు గడిచాయి. అది ఏప్రియల్ నెల. ఆవేళ సూర్యగ్రహణం. తీర్థంలా గంగలో స్నానానికి ప్రజంతా ఇక్కడికిచేరారు. గట్టుమీదవున్న మర్రిచెట్టుక్రింద దుకాణాలుపెట్టారు. చాలామంది యాత్రికులు స్వామివారిని చూడ్డానికివెళ్లారు. వాళ్లల్లో ఒకగుంపు కుసుమ అత్తవారి ఊర్నుంచివచ్చిన ఆడువారుకూడా వున్నారు.

అది ప్రాతఃకాలం. సన్యాసీ నా పావంచమీద కూర్చుని జపతావళంత్రిప్పుతూవున్నారు. ఇంతలోనే ఒకభాగ్యశాలి మోచేత్తో ప్రక్కనున్నావిడను విస్ఫురితనుచేసి, “ఒనే! ఈయన కుసుమ పెనిమిటి గాదుటే?” అంది. ఆరెండో ఆవిడబుగ్గన వ్రేలువేసుకుని “ఓస్, జోసేవ్,” అంది. “చైనులుగారి కడసారివాడే” అంది మూడో ఆవిడ—కొంచెం తలనెరసినావిడ. నాల్గో ఆవిడకుచ్చెళ్లు త్రొక్కుమంటూ, “జోసేవ్! ఆ ముక్కుఅదే! ఆకళ్ళుఅవే! అంతా అదేనే!” అంది. మరొకయిల్లాలు బిందెతో నీళ్లుముంచుకుంటూ, సన్యాసి వేపే చూడన్నా చూడకుండా, “అయ్యో నా తల్లీ! ఆతగాడింకెక్కడున్నాడమ్మా! కుసుమమ్మ తల్లి ఎంతేనా దురదృష్టవంతురాలూ” అంది.

“జోనే ఆయన కింతపొడుగుగడ్డం వుండేదికాదే” అంది ఒకపడుచు. “అవునే ఇంతసన్నగా యెందుకుండేవాడే” అంది మరొక బొద్దుగావున్నావిడ. “మీ దంతాపిచ్చి, అతగాడింతపొడుగెక్కడమ్మా” అంది మరొకపొట్టి కురుచావిడ. దీంతో ఆసమస్య అలా పరిష్కారమయిపోయింది—ఇంకా మహిళాజనంలో పరిపూర్ణప్రచారాన్ని పొందకుండానే.

ఆనాడుపూర్ణిమ. చంద్రుడు కొద్దికొద్దిగా పైకిలేస్తున్నాడు. కుసుమవచ్చి నాక్రింది మెట్టుమీదకూర్చుంది నీటికి దగ్గిరిగా. ఆమె ఛాయనామీదపడ్డది అడ్డంగా.

మిడుతలు నామీదుగాపోతూ కిచకిచలాడుతున్నాయి. గుళ్ళో, జేగంటల ఝూంకారాలూ, గంటల గణగణలూ ఆగిపోయినాయి. ఆకట్టకడపటి శబ్దతరంగంకూడా తగ్గితగ్గిపోయి, ఒకనీడలా, నది కావలిగట్టునవున్న చింతలతోపు చీకట్లలో లీనమయిపోయింది. నల్లని గంగాజలంమీద వెండికరగి వొలకబోసినలా, చంద్రకాంతులుపడ్డాయి అడ్డంగా. ఆ యెదుటి గట్టుమీదా,ఆపొదలలోనూ, ఈపుంతలోను, ఆపాడుపెట్టిన యిళ్లక్రిందా, దేవాలయగోపురంలోనూ తాటితోపులోనూ. ఏవోనీడల సంచలనం. మర్రి కొమ్మల చివర్ణనుంచి కబోదిపక్షులు తలక్రిందుగా వ్రేలాడుతున్నాయి. ఆయిళ్లకు కొంచెందూరంగా నక్కలు చెవులు గింగురెత్తిపోయేటట్టు ఒక్కపెట్టున బ్రహ్మాండంగాం ఊళపెట్టేసి, మళ్లా ‘టపీ’మని ఆగి నిశ్శబ్దమయిపోయాయి.

గుడిలోనుంచి సన్యాసి బయటికివచ్చారు, నెమ్మదిగా రేవులో రెండు మెట్లుదిగి, ఒక ఆడమనిషి ఏకాంతంగా కూర్చునివుండటం చూసి, చటుక్కున ఆగిపోయారు ... వెనుదిరిగిపోబోతున్నారు హఠాత్తుగా కుసుమ తలయెత్తితిరిగిచూచింది. గవిసెన దిగజారింది. పైకెత్తుకున్న ఆ సెముఖి మీద చంద్ర కాంతులు పడ్డాయి.

గుడ్లగూబ ఘూత్కరించుతూ వారి శిరస్సులమీదుగా ఎక్కడికో ఎగిరిపోయింది. చెవులు గింగురెత్తే ఆధ్వని విని తెలివితెచ్చుకుని, ముసుగు సరిచేసుకుంది. కుసుమ నెమ్మదిగాలేచివెళ్ళి సన్యాసికి సాష్టాంగం చేసింది.

స్వామివారు ఆశీర్వదించారు; "ఎవరు నీవూ ?" అని ప్రశ్న.

"నన్ను కుసుమ అంటారు"

మరి మాటలేదు ఆరాత్రి. కుసుమ నెమ్మదిగా యింటికి వెళ్ళిపోయింది, అడుగులు తడబడుతూ. స్వామివారు మటుకు మెట్లమీద అలాగేకూలబడిపోయారు. ప్రొద్దుమరచి అక్కడే చాలానిశివరకూ కూర్చున్నారు — ఏదోఆలోచిస్తూ చంద్రుడు తూర్పునుంచి బాగా పడమరకువచ్చాడు. వెనుకగావున్న వారినీడ ఆయనముందుపడ్డది. నెమ్మదిగాలేచి గుళ్లోకి వెళ్లిపోయారు.

ఆనాటినుంచీ స్వామివారి పాదముల చెంగట ఆనత్కావడానికి కుసుమ రోజూవస్తూవుండేది. ఏపవిత్ర గ్రంథాన్నిగురించైనా ఆయన ఉపన్యసించుతూవుంటే, దూరంగా ఒకమూలకూర్చుని వింటూవుండేది. ప్రాతస్సంధ్యముగించుకుని కుసుమను పిలిచేవారు, ఆయన. మతవిషయాల్ని ఆవిడకు తెలియజెప్పుతూవుండేవారు. కుసుమకేమీ అర్థమయేవికావు. అయినా నిశ్శబ్దంగా నిల్చుని అతిజాగరూకతతో వింటూ వాటిని అర్థంచేసుకోడానికి ప్రయత్నించేది. ఆయన ఎలాచెయ్యమంటే, లెక్కలుగట్టుకుని తత్క్షణం అలాచేసేది. దినదినం దేవాలయంలో ఊడిగమంతా చేస్తూవుండేది — దేవపూజలో ఏమరకుండావుండేది. శివపూజకు పూలుకోసుకొస్తూవుండేది. గుడికడగడానికి నదిలోనుంచి నీళ్లుచేదుకు వెళ్లుతూవుండేది

శీతాకాలం వెళ్లిపోవచ్చినా యింకాచలివేస్తూనే వుంది. కాని, అప్పుడప్పుడు, సాయంత్రంవేళ నులివెచ్చని వసంతవాయువువీస్తోంది, దక్షిణాన్నుంచి. ఆకాశం దానిశైత్యాన్ని వదిలేస్తోంది. శరదాగమనంతో నిశ్శబ్దమయిపోయిన సన్నాయీలూ, సంగీతాలూ మళ్లా వినుపించుతున్నాయి నెమ్మదినెమ్మదిగా ఊళ్లోనుంచి. పడవవాళ్లు వాలున పడవలువదిలేసి, తెడ్లువేడంకూడా మానేసి బాలగోపాలపదాలు పాడుతున్నారు శరత్తు వసంతంగా మారుతోంది. అదీ ఋతువు.

కుసుమ జాడకనబడలేదు. కొంతకాలంనుంచీ ఆవిడ రేవుకుగాని, సన్యాసిని చూచేందుకు దేవాలయంలోకిగాని రావడం మానేసింది.

ఈలోగా యేంజరిగిందో మనకు తెలియదు. కొంతకాలమైనతరువాత ఒకనాటిసాయంత్రం — కప్పెడు కప్పెడు చీకటిపడుతోంది, — వారిద్దరూ, నామెట్లమీద కలుసుకున్నారు, ఒకరినొకరు.

కుసుమ తలవంచుకుని బొటనవ్రేలితో నేలను రాస్తూ, "స్వామీ నన్ను పిలునంపారా ?"

"అవును; నీవెక్కడా కనుపించడంలేదు ? దేవసేవ నింతగా అలక్ష్యచేసుకుంటున్నావేం ?"

కుసుమముఖం వెనక్కుత్రిప్పి, అరచెయ్యి ముఖానికి అడ్డుపెట్టుకుని, గద్గదంగా, "నేను పాపాత్మురాల్ని ప్రభూ! అందుచేత దేవసేవలో నిలువలేకపోయాను" అంది.

"కుసుమా ! నీమనస్సు అల్లకల్లోలంగావున్నదని నేను గ్రహించాను."

కుసుమ కళవళపడ్డది; పైటచెరగు ముఖంమీదికి తీసుకుంది, స్వామివారిపాదాలదగ్గర కూర్చొనిఏడ్చింది.

ఆయన రెండడుగులు వెనక్కితగ్గి "నీహృదయం నాకు విప్పిచెప్పు; నీకు మనశ్శాంతికలిగేఉపాయం నేచెపుతాను."

కుసుమ భక్తివినయాలు ఉట్టిపడేటట్టు అంటుంది.

"తమరలా శాసించుతే నేను చెప్పవలసేవస్తుంది కాని అప్పుడైనా తమకు సుస్పష్టంగా నివేదించుకోలేనేమో. ప్రభూ! నేనొక మహాపురుషుణ్ణి భగవంతునిగా ప్రేమించాను. వారికి భక్తిచేసుకుంటూ వున్నాను. ఆభక్తి పారవశ్యంతో నామనస్సునిండి తొణుకాడింది. కాని ఒకనాటిరాత్రి నేనొకకల గన్నాను. ఆ స్వాప్రభువు, ఒకతోటలో ఒకమూల నాప్రక్కనకూర్చుని, నాకుడిచేతిని ఆప్యాయంగా ఆయన యెడమచేతిలోకి తీసుకుని, నా చెవిలో ప్రణయభాషలు చెబుతున్నాడు రహస్యంగా. ఆరంగం అంతా నాకప్పుడేమీ విపరీతంగా అగుపించలేదు

కలఅదృశ్యమైపోయింది. నామనస్సుమాత్రం దాని పిడికిలిలోనుంచి విడిబడలేకపోతోంది.

తెల్లవారి మళ్లా స్వాప్రభువును నేను ముఖాముఖి చూచుకున్నాను. నామనస్సుకు ఆయన పూర్వంలా కాకుండా మరోలా కనుపించారు. ఆ స్వాప్నిక ప్రతిమ నాహృదయాన్ని ఆవేసించి కలవరపెట్టడం మొదలుపెట్టింది. నేను వారి సామీప్యాన్ని వదిలేసి దూరంగా పారిపోయాను. కాని ఆ ప్రతిమమాత్రం నాహృదయాన్ని అంటుకునేవుంది. అప్పటినుంచీ శాంతి నాలో నశించిపోయింది. నాలో అంతా చీకటి...అయోమయం."

ఆవిడ కళ్లనీళ్లుతుడుచుకుంటూ తనకథ చెబుతూన్నంత సేపూ సన్యాసి తనకుడికాలి బొటనవ్రేలితో నామెట్టు మీద గట్టిగా నొక్కుతూనేవున్నాడు.

ఆవిడ చెప్పటం అయిపోయింది. సన్యాసి "కలలో నీవు చూచిందెవరో చెప్పలేదేంమరి," అన్నారు. కుసుమ చేతులునులిపికొంటూ "నన్ను మన్నించాలి: చెప్పలేను," అంది గద్గదంగా.

"చెప్పాలి"

"ప్రభూ! తప్పదూ?"

"చెప్పాలి,—ఆజ్ఞాపించుతున్నాం"

"నా స్వాప్నికపురుషుడు తమరేప్రభూ!"

కుసుమ వెక్కివెక్కియేడుస్తూ, అతనిపాదాల దగ్గర ఆపాషాణాలమీద కూలబడిపోయింది.

కొంచెంసేపటికి తెప్పరిలి కుసుమలేచి కూర్చుంది—కన్నీరు జోటజోట కారుస్తూ.

స్వామివారు నెమ్మదిగా, "నీవు నన్ను మళ్లా చూడకుండా వుండేందుకుగాను, ఈ ప్రదేశాన్నివిడిచి వెళ్లిపోతున్నాను, ఈరాత్రే. నేను ఆశ్రమం తీసుకున్నాను. నాకూ యీప్రపంచానికీ ఏమీ సంబంధం లేదు. నీవు నన్ను మరచిపోవాలి."

"అల్లాగేప్రభూ," అంది కుసుమ నెమ్మదిగా.

తపసి "నేను వెళ్లివస్తాను" అన్నారు.

కుసుమ నిశ్శబ్దంగావంగి నమస్కరించి అతని పాదాలదగ్గరవున్న ధూళితీసి తలమీదవేసుకుంది.

ఆయన చరచరా నడిచివెళ్లిపోయారు.

చంద్రుడు అస్తమించాడు; రాత్రి మరింత చీకటైపోయింది. నీటిలో ఏదో...చ్...అని ఒకశబ్దం నాకు వినుపించింది.

"ఈ ఆకాశంమీదవున్న చుక్కలన్నిటినీ పూడేస్తాను" అన్నట్లుగా గాలి రివ్వునవీచింది ఆచీకట్లో—